క్లుప్తంగా

విద్యుత్‌ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: శాంతినగర్‌ 11 కేవీ ఫీడర్‌ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్‌–1 ఈఈ(ఆపరేషన్స్‌) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంజీవయ్య కాలనీ, కైలాసపురం, శాంతినగర్, ఎంఈఎస్‌ గేట్‌ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

ముస్లింల శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: మహమ్మద్‌ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం ముస్లింలు మిలాద్‌ ఉన్‌ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 53వ వార్డు జాకీర్‌ హుస్సేన్‌నగర్‌ మస్జీద్‌ ఈ అల్‌ ఖదీర్, మద్రిపాలెం మస్జీద్‌ ఈ అల్‌ పత ఆధ్వర్యంలో మసీదుల వద్ద స్థానిక ముస్లింలు ఖురాన్‌ పఠించారు. మక్కా, మదీనా నమూనాలు ప్రదర్శిస్తూ శాంతి ర్యాలీ చేశారు. అనంతరం దావత్‌ నిర్వహించారు. కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

29న శెట్టిబలిజ వివాహ పరిచయ వేదిక


కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శెట్టిబలిజ కమ్యూనిటీ ప్రతినిధులు

సీతంపేట: ఈ నెల 29న ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో శెట్టిబలిజ కట్టా వారి వివాహ పరిచయ వేదిక జరుగుతుందని నిర్వాహకుడు కట్టా మల్లేశ్వరరావు తెలిపారు. గ్రంథాలయంలో శుక్రవారం కార్యక్రమ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 29వ తేదీ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామన్నారు. దీనిలో పాల్గొన దలచిన వారు ఈ నెల 15లోగా 90001 66144 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ప్రతినిధులు పిల్లి జయరామ్, కాంద్రేగుల ఉమా వెంకట మహేష్, కడలి సత్యనారాయణ, కడలి సుబ్బారావు, సంపంగి చంద్రకాంత్, కట్టా శ్రీకాంత్, చెల్లిబోయిన నాగేశ్వరరావు, బొంగు రాజారావు, వై.విజయ, గుబ్బల మీరేంశెట్టి, కట్టా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎస్‌జీజీ వోస్‌ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఇళ్ల ముందు డ్రెయిన్‌ వ్యర్థాలతో ఇబ్బందులు


పాలబూత్‌ సెంటర్‌ వెనుక రోడ్డులో ఇళ్ల ముందు ప్రవహిస్తున్న వ్యర్థాలు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అక్కయ్యపాలెం పాలబూత్‌ సెంటర్‌ వెనుక రోడ్డులో సాయిస్వరూప్‌ ఎన్‌క్లేవ్, 45–45–5 ఇంటి నంబర్‌ వద్ద డ్రెయిన్‌ పైప్‌లైన్‌ లీకై మలమూత్ర వ్యర్థాలు రోడ్డుపై ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల ముందు నుంచి మలమూత్రాలు ప్రవహించడంతో కాళ్లు బయటపెట్టలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని నివాసులు కోరుతున్నారు.


రెడ్డి కంచరపాలెం సచివాలయంలో సక్రమంగా పనిచేయని మానిటర్, నిరుపయోగంగా ప్రింటర్


జోగారావునగర్‌ సచివాలయంలో మూలకు చేరిన సీపీయూ, ధ్రువపత్రాల ప్రింట్‌ కోసం వేచి ఉన్న దరఖాస్తుదారులు


పోస్టాఫీస్‌ వీధి సచివాలయంలో పనిచేయని ప్రింటర్

ప్రింటర్లు పనిచేయవు..
ధ్రువపత్రాలు జారీ కావు

- జోన్‌–5 పరిధి సచివాలయాల్లో సక్రమంగా పనిచేయని పరికరాలు
- పత్రాల ప్రింట్ల కోసం మీ సేవ, ఇంటర్‌నెట్‌ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి
- నిర్లక్ష్య ధోరణిలో సచివాలయ సిబ్బంది
- ప్రజల ఇబ్బందులను పట్టించుకోని అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్‌–5 పరిధి 46, 47, 48, 54, 55 వార్డుల్లోని పలు సచివాలయాల్లో ప్రింటర్లు, మానిటర్లు పడకేశాయి. కంచరపాలెం, కైలాసపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మద్రిపాలెం పరిధి ధర్మానగర్, తిక్కవానిపాలెం, జోగారావునగర్, అశోక్‌నగర్, రెడ్డి కంచరపాలెం, బాపూజీనగర్, శాంతినగర్, కప్పరాడ, ఇందిరానగర్, భవానీ గార్డెన్స్, జ్యోతినగర్‌ సచివాలయాల్లో కొన్ని నెలలుగా ప్రింటర్లు పనిచేయకున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వార్డు సచివాలయాలు నిర్వీర్యమవుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.


అధ్వానంగా రెడ్డి కంచరపాలెం సచివాలయం

బయట సెంటర్లలో ప్రింట్‌ తీసుకోండి..!

వాస్తవానికి సచివాలయాల్లో కుల, నివాస, ఆదాయ, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి ప్రింట్లు ఇవ్వాల్సి ఉంటుంది. పలు సచివాలయాల్లో ప్రింటర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది సర్టిఫికెట్ల వెనుక స్టాంప్‌ వేసి, సంతకాలు చేసి బయట ఇంటర్‌నెట్, మీ సేవ కేంద్రాలకు వెళ్లి ప్రింట్‌ తీసుకోండంటూ సర్టిఫికెట్లను వాట్సాప్‌ రూపంలో పంపుతున్నారని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఈ సమస్యపై అడుగుతుంటే కొందరు సచివాలయ సిబ్బంది వాగ్వాదాలకు దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇటీవల ఇటువంటి ఘటనలు పలు సచివాలయాల్లో జరిగాయి. గతంలో సచివాలయ సిబ్బంది బదిలీలు ఉండటంతో జూలై వరకు వేచి చూసిన ప్రజలు.. ఇప్పుడు కొత్త సిబ్బంది విధుల్లోకి చేరినా.. పాత కంప్యూటర్లు, పనికిరాని ప్రింటర్లతో తంటాలు పడుతుండటంతో విసుగు చెందుతున్నారు. సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయని దుస్థితి నెలకొన్నా.. జీవీఎంసీ జోన్‌–5 కార్యాలయ సిబ్బంది స్పందించక పోవడంతో పరికరాల మరమ్మతులకు చేతి చమురు వదులుతోందని సచివాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధ్రువపత్రాలు అందక ఆవేదన

ఒకవైపు విద్యా, ఉద్యోగ సంబంధిత కౌన్సెలింగ్‌లు జరుగుతున్న సమయంలో కుల, నివాస, ఆదాయ తదితర ధ్రువపత్రాలు అందకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత వాటిని కౌన్సెలింగ్‌లో చూపించి దరఖాస్తు చేసినా.. పత్రాలు పొందలేకపోతున్నామని, ఓ లెటర్‌ రాస్తే కౌన్సెలింగ్‌కు అనుమతి ఇచ్చి సీటును అలాట్‌మెంట్‌ చేస్తున్నారని చెబుతున్నారు. ఆయా సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయకపోవడంతో ఇంటర్‌నెట్‌ సెంటర్లను ఆశ్రయించాల్సిన రీతిలో ప్రజాప్రతినిధులు పాలన చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. జోన్‌–5 అధికారులు స్పందించి సచివాలయాల్లో పనిచేయని పరికరాలకు మరమ్మతులు చేయించి, సకాలంలో ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



సచివాలయాల్లో దరఖాస్తు చేసిన కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాల కోసం వెళ్తే ప్రింటర్లు పనిచేయడం లేదని సిబ్బంది సమాధానం చెబుతున్నారు. ప్రింట్‌ కావాలని అడిగితే మీ సేవ, ఇంటర్‌నెట్‌ సెంటర్లకు వెళ్లి తీసుకోవాలంటూ ప్రింట్‌ పేపర్‌ వెనుక సంతకం చేసి ఖాళీ సర్టిఫికెట్‌ ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన లేదు. ఈ సమస్యపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తాం.

– సిహెచ్‌.రమేష్‌కుమార్, కంచరపాలెం

రైల్వేస్టేషన్‌లో 9.8 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 9.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సిహెచ్‌.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.టి.ఆర్‌.లక్ష్మి, ఆర్పీఎఫ్‌ ఎస్‌ఐ అభిషేక్‌ మిస్త్రీలు తమ సిబ్బందితో కలసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. బిహార్‌ రాష్ట్రం వెస్ట్‌ చంపారన్‌ జిల్లాకు చెందిన సోను కుమార్‌సింగ్‌ విశాఖ స్టేషన్‌ మీదుగా బిహార్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండటాన్ని గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని, సుమారు రూ.49 వేల విలువైన 9.8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జీఆర్పీ ఎస్‌ఐ లక్ష్మికి అప్పగించారు. రిమాండ్‌ నిమిత్తం నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

పార్కింగ్‌ చార్జీలు తగ్గించాలని వినతి


సీనియర్‌ డీసీఎంకు వినతిపత్రం సమర్పించిన రైల్వే ప్రయాణికులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్‌ డివిజన్‌ పరిధిలోని రైల్వే స్టేషన్ల వద్ద గల పార్కింగ్‌ స్థలాల్లో పార్కింగ్‌ చార్జీలు తగ్గించాలని కోరుతూ పలువురు రైల్వే ప్రయాణికులు శుక్రవారం డొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలో సీనియర్‌ డివిజనల్‌ కమర్షియల్‌ మేనేజర్‌ కె.సందీప్‌కు వినతిపత్రం సమర్పించారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో నెలవారీ ప్రయాణించే వారికి (మంత్లీ సీజన్‌ టికెట్‌ హోల్డర్స్‌) గతంలో రూ.300 పార్కింగ్‌ చార్జీలు ఉండేవని, ఇటీవల వీటిని రూ.700కు పెంచారని, ఇది తమకు భారమవుతోందని వారు తెలిపారు. ఈ విషయమై సీనియర్‌ డీసీఎంకు వినతిపత్రం సమర్పించామన్నారు.

రంగరంగ వైభవంగా దుర్గాగణపతి ఊరేగింపు

- ముగిసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


బిందెలతో డ్యాన్స్‌ చేస్తున్న మహిళలు


ఊరేగింపులో అలరిస్తున్న బొమ్మల డ్యాన్స్‌


సీతంపేటలో సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవమూర్తుల పల్లకీ ఊరేగింపు

సీతంపేట: సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఉత్సవమూర్తుల తిరువీధి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణలో మేళతాళాలతో భక్తులు పల్లకీపై పురవీధుల్లో కనుల పండువగా ఊరేగించారు. బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, ఉత్సవ కమిటీ చైర్మన్, కార్పొరేటర్‌ సారిపిల్లి గోవింద్, ఆలయ ఈవో జి.వి.రమాభాయి, ప్రధాన అర్చకుడు నటరాజన్‌ ఉత్సవ మూర్తికి తొలి పూజలు చేశారు. అనంతరం వారంతా పల్లకీ మోసి తిరువీధి ఉత్సవాన్ని ప్రారంభించారు. స్థానికులు, భక్తులు, యువత పల్లకీ మోసేందుకు పోటీపడ్డారు. సీతంపేట కూడలిలో ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు గురుద్వారా, గొల్ల వీధి, గణేష్‌నగర్, కనకమ్మ ఆలయం, రాధాకృష్ణ మందిరం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి హారతులతో దుర్గాగణపతికి నీరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గరిడీలు, కోలాటం, తప్పెట గుళ్లు, తీన్‌మార్, నవదుర్గల డ్యాన్స్‌ ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు ఊరేగింపులో పాల్గొని పల్లకీ వెంట నడిచారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భారీ అన్నసంతర్పణలు


51వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: గణేష్‌ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 51వ వార్డులో అన్నసంతర్పణలు నిర్వహించారు. మాధవధారలో అయ్యప్ప యూత్‌ కమిటీ, జై భీంనగర్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అయ్యప్ప యూత్‌ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు నూకరాజు, కేతిమూర్తి రామారావు, సాయి, జైభీం యూత్‌ అసోసియేషన్‌ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


54వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న గుజ్జు వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి

2 వేల మందికి అన్నప్రసాదం

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు రెడ్డి కంచరపాలెం సన్‌రైజ్‌ క్లబ్‌ వద్ద భారత్‌ పుత్ర అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులు రాష్ట్ర ఆటవీ శాఖ మాజీ డైరెక్టర్‌ గుజ్జు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు, జిల్లా గ్రీవెన్స్‌ సెల్‌ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సీరపు దివాకర్‌రెడ్డి, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, రఘు, రాజు, గురునాథ్, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు దైవంతో సమానం


సిస్టర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్‌ పూర్ణిమ, శ్రీధర్‌

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులోని ఎయిడెడ్‌ పాఠశాలలు, కళాశాలలల్లో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు కార్పొరేటర్‌ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్‌ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సోఫియా జూనియర్‌ కళాశాలలో జరిగిన వేడుకల్లో పూర్ణిమ, శ్రీధర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని హెచ్‌ఎం రెవరెండ్‌ ఫాదర్‌ విజయ్‌భాస్కర్, ఫాదర్‌ నాయుడు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దైవంతో సమానమన్నారు. తల్లిదండ్రులు మన ఆలనా పాలనా కోసం తపిస్తే.. ఉపాధ్యాయులు మనకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి భావితరానికి స్ఫూర్తిగా నిలపాలని కృషి చేస్తారన్నారు. సిస్టర్‌ ఫ్రాన్సికా, సిస్టర్‌ మేరీ హెలీనా, సిస్టర్‌ నిర్మల జ్యోతిలను సత్కరించి అభినందించారు.

గురుదేవోభవ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం ■ గురువులకు సత్కారాలు


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మురళీనగర్‌ వాకర్స్‌ క్లబ్‌ ప్రతినిధులు

మురళీనగర్: భారతరత్న, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌ జయంతి సందర్భంగా శుక్రవారం నియోజకవర్గంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. మురళీనగర్‌ వాకర్స్‌ పార్కులో వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. క్లబ్‌ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్‌ అధ్యక్షతన సీనియర్‌ ఉపాధ్యాయులు, క్లబ్‌ సభ్యులను గద్దె చక్రధర్‌ సహకారంతో పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందించారు. ప్రభుత్వ బాలికల కాలేజీ పీజీటీ కళిరెడ్డి వెంకటరావు, అన్నెపు దామోదర్‌రావు, పైడి నిర్మల, ఎ.రామకృష్ణరెడ్డి, వెంకట వర్మ, కనకరాజు, జి.విజయలక్ష్మి, ఎం.పద్మావతి, సూర్యనారాయణ, ఎస్‌.ధనుంజయరావు, పరమేశ్వరరావు, యు.సురేష్‌ కుమార్, కె.వి.రమణమూర్తి, జి.సత్యనారాయణమూర్తి, బాబ్జీలను ముఖ్య అతిథి వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌ కమల్‌ బైద్‌ సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్‌ డిస్ట్రిక్ట్‌–101 గవర్నర్‌ కె.ద్వారకానాథ్, వాకర్స్‌ క్లబ్‌ కార్యదర్శి సీహెచ్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు, ఎన్‌.బుచ్చయ్య, వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ అదనపు సెక్రటరీ జనరల్‌ ఆర్‌.సత్యనాథం, ఎస్‌. ప్రకాశరావు, కోశాధికారి రోనంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకం

ఉపాధ్యాయులు తమ బోధన ద్వారా విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించాలని ఏపీఎస్‌ ఇన్‌ఫోటిక్‌ చైర్మన్‌ డాక్టర్‌ కమల్‌ బైద్‌ అన్నారు. స్థానిక బాలభాను పాఠశాలలో మాస్టర్‌ ఈకే శత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. మాస్టర్‌ ఈకే స్థాపించిన విద్యాలయాలు చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాయని పేర్కొన్నారు. జగద్గురు పీఠం డైరెక్టర్‌ చింతలపాటి సత్యదేవ్‌ మాట్లాడుతూ మాస్టర్‌ ఈకే చేసిన సామాజిక సేవలను వివరించారు.

అతిథులకు మాస్టర్‌ ఈకే గ్రంథాలను బహూకరించారు. పాఠశాల కరెస్పాండెంట్‌ బి.ఆర్‌.కె.రాజు ప్రసంగించారు. ఈ సందర్భంగా యూనివర్సల్‌ యూత్‌ వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షులు సిహెచ్‌.వంశీకృష్ణ వర్మ, మాధవధార మహిళా వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షురాలు కె.మాధవి సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి 30 మంది బాలభాను విద్యాలయం ఉపాధ్యాయులతోపాటు నగరంలోని ఇతర పాఠశాలలకు చెందిన 13 మంది గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్‌ జిల్లా 101 గవర్నర్‌ కె.ద్వారకానాథ్, వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ ప్రతినిధులు నండూరి రామకృష్ణ, యు.శుభ, ఆర్‌ఆర్‌ఆర్‌ మహేష్, బాలభాను ట్రస్టీ వి.పార్వతి, ప్రిన్సిపాల్‌ ఎ.శుభశ్రీ, వైస్‌ ప్రిన్సిపాల్‌ మనోరమణి, జనకులం ఫౌండేషన్‌ ధర్మకర్త సిహెచ్‌.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.


బాలభాను విద్యాలయంలో గురు సత్కారం పొందిన ఉపాధ్యాయులు

అంగన్‌వాడీ సిబ్బంది జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి లలిత

తాటిచెట్లపాలెం: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల జీతాలను తక్షణమే పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ అసోసియేషన్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. వాసుదేవ నగర్‌లోని సామాజిక భవనంలో శుక్రవారం అసోసియేషన్‌ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి జె.లలిత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 56 వేల సిబ్బందికి వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, మెనూ బిల్లులు పెంచాలని డిమాండ్‌ చేశారు. నాణ్యమైన పోషకాహార సరకును ప్రతి నెలా 5లోపు సెంటర్లకు చేర్చాలని, అన్ని జిల్లాలకు వేతనాలు సక్రమంగా జమ చేయాలని, లేనిపక్షంలో మిత్ర సంఘాలతో కలిసి మరో పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్‌ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందని, వీటిని పునరుద్ధరించే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కారవుతాయన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఏఐటీయూసీ పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కృపారాణి, జిల్లా అధ్యక్షురాలు పి.శ్యామలాదేవి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, ఎ.నూకరత్నం, పి.సీత, అనిత, అరుణ, రాధారాణి, సుబ్బలక్ష్మి, సంతోషి, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.